క్లుప్తంగా

మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక



బీబీపేట: మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో మండల సమాఖ్య సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా సదాల స్రవంతి, కార్యదర్శిగా వేముల దివ్య, కోశాధికారిగా చింతకుంట లతను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అధికారిగా ఏపీఎం రాజు, బీబీపేట ఏపీఎం బాలపోచయ్య, రాంచంద్రగౌడ్, సీసీలు శ్రీనివాస్, బాలచంద్రం, రాజేశ్వరెడ్డి, నవీన్, రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కామారెడ్డి టౌన్/గాంధారి : వికారాబాద్‌లో 22 నుంచి 25 వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానాచార్యులు నాగభూషణం శనివారం తెలిపారు. విద్యార్థినులు కీర్తన, రిషిక, షారోన్, నవ్య శ్రీ, ఆరాధ్య, వర్షిత, ఆష్మిత, చామినిలు శనివారం నుంచి జరగబోయే పోటీలో పాల్గొంటారని తెలిపారు. అలాగే గాంధారి మండల పరిధిలోని పేట్‌సంగెం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బూక్య అర్జున్, బానోత్ ఉషా ఎంపికైనట్లు పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్ రాథోడ్, నవీన్ రావు, గంగరాజు, మమత తదితరులున్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ ముజీబ్, ఎస్సై విజయ్ కొండ పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు వారు చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. వారితో పాటు ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మహిళలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని మండల ఐకేపీ ఏపీఎం జగదీశ్‌కుమార్ సూచించారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం ఆరోగ్యం, పోషణపై మహిళాసంఘ సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలకు, వీవోఏలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆకుకూరలు, కూరగాయలు, మాంసం, గుడ్లతోపాటు వివిధ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సీసీలు నారాయణ, రమేష్, దత్తు, రషీద్, సాయిలు, సుజాత, అకౌంటెంట్ రాజు, ఆపరేటర్ రవితోపాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను వార్డు ఆఫీసర్లకు తెలియజేయాలి

ఎల్లారెడ్డి రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలుతమ కాలనీలో నెలకొన్న సమస్యలను వార్డు ఆఫీసర్లకు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో వార్డుల వారీగా వార్డు ఆఫీసర్లను నియమించమన్నారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు చైర్మన్ పరామర్శ

బాన్సువాడ : డీసీసీబీ డైరెక్టర్ కమలాకర్‌రెడ్డిని శనివారం ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి పరామర్శించారు. బీర్కూర్ మండలం దామరంచ సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కమలాకర్‌రెడ్డి మాతృమూర్తి రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయనను డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, హరికలు పరామర్శించారు.

సంతలో సౌకర్యాలు కరువు

- రోడ్డుపైనే విక్రయాలు
- ఆదాయం ఉన్నా...ఆదరణ లేదు
- సొంత స్థలం లేక తీవ్ర ఇబ్బందులు



ప్రైవేటు స్థలంలో కొనసాగుతున్న సంత

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సంతకు స్థలం లేక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది తైబజార్ వేలం రూ.ఐదు లక్షలకు పైగా పలికింది. ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీకి లక్షల్లో ఆదాయం వస్తున్నా పాలకులు, అధికారులు దశాబ్దాలుగా సంతకు ప్రత్యేక స్థలం కేటాయించడం లేదు. ప్రతిశుక్రవారం సంతను రోడ్డుపై నిర్వహిస్తున్నారు. సంతలో తాగడానికి నీరు, మహిళలకు ప్రత్యేక మూత్రశాలలు లేక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు సంతలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడంలేదని చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి దుకాణాదారుడి వద్ద రూ. 50 నుంచి 100 వసూలు చేస్తున్నారు. వేసవి కాలంలో ఎండలోనే విక్రయాలు చేపడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయమై ఇబ్బందిగా మారుతుంది. చుట్టూ ప్రక్కల నుంచి డ్రెయినేజీ నీరు సంతలోకి ప్రవేశించి తెచ్చిన సరుకులు నీటిపాలై చాలా నష్టపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ప్రైవేటు స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తే స్థలం యజమానులు అనుమతులు ఇవ్వడం లేదు. సంత రోడ్డుపై జరగడంతో ప్రయాణికులు, వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి శుక్రవారం పోస్టాఫీసు నుంచి పోలీస్ స్టేషన్ వరకు గల రోడ్డును మూసివేస్తున్నారు. దాంతో బస్టాండు వైపు నుంచి చుట్టూ తిరిగి సంతకు పోవాల్సి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. సంతలో దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని అరికట్టడానికి నిఘా ఏర్పాటు చేయాలి. ప్రతి ఏడాది తైబజార్, దద్వాయి పేరిట లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. సంత జరుగుతున్న స్థలంలో సీసీ రోడ్లు, మురికి కాల్వలు, మూత్రశాలలు నిర్మాణం చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

వర్షం పడితే మురికిలోనే..



గత పదేళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. ప్రతి వారం సంతకు కూరగాయాలు తీసుకొస్తాను. సంతలో కనీస వసతులు లేవు. తాగునీరు దొరకదు. వర్షం పడితే డ్రెయినేజీ కాల్వ నుంచి మురికినీరు మార్కెట్‌లోకి వస్తుంది. వ్యాపారులకు, కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. పాలకులు, అధికారులు స్పందించి సంతలో మౌలిక వసతులు కల్పించాలి.

– కొడబోయిన రాకేష్, పర్మళ్ల

పాలకులు స్పందించాలి



గత పదిహేనేళ్లుగా వ్యాపారం చేస్తున్నాను. ప్రతి వారం లింగంపేట సంతకు సరుకులు తీసుకొని వస్తాను. సంతకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలి. రేకుల షెడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. సరుకులపై దుమ్ము, ధూళి పడకుండా, వర్షం పడితే సరుకులు బురదమయం కాకుండా సంత జరుగుతున్న ప్రదేశాల్లో సీసీ రోడ్డు వేయించాలి. పాలకులు, అధికారులు స్పందించాలి.

–ఎండీ గౌస్, ఎల్లారెడ్డి

జోరందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



గున్కుల్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీబీపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జిల్లాలో జోరందుకుంది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మహమ్మద్ నగర్ మండలవ్యాప్తంగా నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను కోరారు. నాయకులు రమేష్‌యాదవ్, నాగభూషణం గౌడ్, సాయాగౌడ్ తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి భారీ మోజార్టీతో గెలిపించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పట్టభద్రులను కోరారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి నియోజకవర్గంలోని పట్టాభద్రులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి ఓట్లు అడిగారు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే శాసన మండలిలో నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా కృషి చేస్తారన్నారు.

బీబీపేట: మండల కేంద్రంతో పాటు ఇస్సానగర్, మాందాపూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంజిత్‌గౌడ్, హరీష్ గౌడ్, మహేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని ఓటర్లను కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రావు, లింగారావు, శ్రీనివాస్, యాదగిరి, రాజిరెడ్డి, దత్తు, రాజు పాల్గొన్నారు.

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద తడ్గూర్‌లో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు తుకారం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్, శ్రీధర్ పంతులు, వీరేశం, శివకుమార్, కార్యకర్తలున్నారు.

కామారెడ్డి టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సీపీఐ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన్ని గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

'చట్టవిరుద్ధంగా ప్రైవేట్ టీచర్ల ఎమ్మెల్సీ ఓట్లు తొలగించారు'

కామారెడ్డి టౌన్ : నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల తుది జాబితాలో ఉన్న ప్రైవేట్ కళాశాలల లెక్చరర్లు, టీచర్ల పేర్లను చట్ట విరుద్ధంగా తొలగించారని తెలంగాణ లెక్చరర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఓ ఉపాధ్యాయ సంఘం వారి అభ్యర్థి ఓడిపోతాడని భయంతో కరీంనగర్ ఎలక్ట్రోలర్ అధికారికి ఉద్దేశ్య పూర్వకంగానే తప్పుడు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఫిర్యాదుతో కామారెడ్డి జిల్లాలో 276 మంది ఓట్లను తొలగించారని, వారి వివరాల జాబితాను ప్రకటించారు. ఫిర్యాదు వస్తే విచారణ చేపట్టకుండా, ఓటర్లకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించడం సరికాదన్నారు. తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈఘటనపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన



తాడ్కోల్‌లో ప్రకృతి వనం పరిశీలిస్తున్న అధికారులు



గర్గుల్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బాన్సువాడ రూరల్ : మండలంలోని తాడ్కోల్, బుడిమి గ్రామాల్లో శనివారం మండల పంచాయతీ అధికారి సత్యనారాయణరెడ్డి పర్యటించారు. గ్రామంలోని వన నర్సరీలు పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్త పడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామంలోని వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, కంపోస్టుషెడ్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, కారోబార్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనం తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం కేంరాజ్ కల్లాలి గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ప్రకృతి వనంలో నాటి చెట్లను సంరక్షించాలని పంచాయతీ అధికారులను ఆయన ఆదేశించారు. ప్రకృతి వనం పక్కన ఉన్న కంపోస్ట్ షెడ్డును వినియోగించి వర్మికంపోస్టు తయారు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీవో నాగవర్ధన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భూమి అభివృద్ధి పనులను సక్రమంగా చేపట్టాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసే విధంగా చూడాలన్నారు. టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ బాల్‌రాజు తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్లారెడ్డి : పట్టణ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అధ్యక్షుడిగా రొట్ట నరేశ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా బొక్కల సాయిబాబు, బక్కోళ్ల కిషన్, గుంటి గారి భూమేష్, సంగని సంతు, ప్రధాన కార్యదర్శిగా మర్లు సాయిలు మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పద్మారావు, సాయిబాబా తదితరులున్నారు.

ఆలయానికి సీసీ కెమెరాలు వితరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమల్‌పల్లి, కేశాయిపేట గ్రామాల శివారులోని అల్లూరమ్మ ఆలయానికి శనివారం దాతలు సీసీ కెమెరాలు వితరణ చేశారు. మెంగారం గ్రామానికి చెందిన మంగళి విఠల్, భార్య నాగమణి, కుమారుడు అరవింద్ కుటుంబ సభ్యులు అల్లూరమ్మ ఆలయానికి స్వచ్ఛందంగా నాలుగు సీసీ కెమెరాలు రూ. 25 వేలతో కొనుగోలు చేసి ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. శనివారం కెమెరాలు ఆలయంలో బిగించారు. ఇటీవల ఆలయంలో తరుచూ చోరీలు జరుగుతున్న దృష్ట్యా భద్రత కోసం సీసీ కెమెరాలు విరాళంగా అందజేసినట్లు వారు పేర్కొన్నారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షేత్ర పర్యటనలో ఉప్పల్‌వాయి గురుకుల విద్యార్థులు



రామారెడ్డి : ఉప్పల్‌వాయి గురుకుల కళాశాల విద్యార్థులు పీఎం శ్రీ పథకంలో భాగంగా శనివారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. ఇందులో భాగంగా పట్టణంలోని డైరీ టెక్నాలజీ కళాశాలను సందర్శించి, పాటిస్తున్న సాంకేతికతను తెలుసుకున్నారు. అనంతరం లింగంపేట్ మండలంలోని నాగన్న మెట్ల బావిని సందర్శించారు.

శివరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై పుష్పరాజ్

రాజంపేట : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ పరిధిలో సంగమేశ్వర ఆలయం వద్ద జరిగే శివరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని గ్రామస్తులకు ఎస్సై పుష్పరాజ్ సూచించారు. ఇటీవల గ్రామ శివారులో ప్రధాన రోడ్డుపై నిర్మించిన నూతన బ్రిడ్జి కారణంగా ఆలయానికి వెళ్లే పాత దారి మూసుకుపోయింది. దీంతో గ్రామస్తులు, రైతులు వారి పొలాలకు, ఆలయానికి దారి పక్కనే ఉన్న లావణ్ పట్టా భూమి నుంచి దారి కల్పించాలని కోరుతూ తహసీల్దార్ అనిల్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఇదే విషయంపై ప్రజావాణిలో కూడా దరఖాస్తు ఇచ్చారు. గత సంవత్సరం ఆలయం నుంచి కాలువ వరకు సీసీ రోడ్డు వేశారు. దీంతో బ్రిడ్జి వద్ద పాత రోడ్డు మూసుకుపోవడంతో దారి సమస్య నెలకొంది. శనివారం తహసీల్దార్ అనిల్‌కుమార్ గ్రామస్తులను పోలీస్ స్టేషన్‌కి పంపగా పోలీస్ సిబ్బంది ముందస్తు చర్యగా ఇరు వర్గాల వారిని పిలిపించి మాట్లాడారు. శివరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు. దారి సమస్యపై ఉత్సవాల అనంతరం సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని రైతులకు కౌన్సెలింగ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అవగాహన



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ అశోక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అచ్చాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై శనివారం లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ అశోక్ మాట్లాడుతూ లబ్ధిదారులు ముందుగా చూపిన స్థలంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇదివరకు నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించబడవని ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు విడతలవారీగా బిల్లులు చెల్లిస్తామని ఆయన వివరించారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభాకరచారి, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం



మహ్మద్‌నగర్‌లో బోర్లను పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేటలో గల సాయినగర్ కాలనీలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ముందస్తుగా పైపులైన్ ఏర్పాటు పనులను శనివారం అధికారులు ప్రారంభించారు. గ్రామంలోని సాయినగర్ కాలనీలో ఇదివరకు నిర్మించిన మంచినీటి ట్యాంకుకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసి ట్యాంకు నుంచి కాలనీ వాసులకు మంచినీటిని అందించేందుకు పైపులైన్ వేస్తున్నారు. గ్రామంలో పైపులైన్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) నుంచి రూ.2లక్షలు మంజూరు చేశారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ఈ మేరకు కాలనీలో 416మీటర్లమేర పైపులైన్ వేస్తున్నామని వారు చెప్పారు.

బోరుబావులను పరిశీలిస్తున్న అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమవుతున్న బోరుబావులను శనివారం ఎన్‌హెచ్, మిషన్ భగీరథ అధికారులు తనిఖీ చేశారు. బోధన్‌- హైదరాబాద్ రహదారి విస్తరణ జరుగుతుండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ బోర్లను అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వర్ణలత, ఎన్‌హెచ్ ఏఈ శ్రీధర్‌కుమార్ తదితరులున్నారు.

ఘనంగా స్కౌట్స్, ఆలోచన దినోత్సవం



మాచారెడ్డి : మండలంలోని సోమారంపేట, ఘన్‌పూర్(ఎం) ఉన్నత పాఠశాలల్లో శనివారం స్కౌట్స్ ఉద్యమ నిర్మాత లార్డ్ బాడెన్ పావెల్ జయంతితో పాటు ప్రపంచ ఆలోచనా దినోత్సవాన్ని స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్, శారద, స్కౌట్స్ మాస్టర్ గోపాలకృష్ణ, పీడీ సంధ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

మద్నూర్‌లో ఘనంగా శివాజీ జయంతి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో శివాజీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

పిట్లం(జుక్కల్): చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం చేనేత సహకార సంఘం సభ్యులు మండలకేంద్రంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. క్యాలెండర్లను సంఘ సభ్యులకు, వ్యాపారస్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీలకంటి సంతోష్, పిట్లం నీలకంఠ సమాజ అధ్యక్షులు మరగల దయానంద్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గూడ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కనకదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



బాన్సువాడ : పట్టణంలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కాశీ సంతోష్‌శర్మ, విజయ్‌పంతులు, సంగమేశ్వరప్పలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవికి పంచామృతాభిషేకం చేశారు. మహిళలు సాముహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పల్లకీ సేవ నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మామిళ్ల రాజు, అంబిల్‌పూరి రాజు, బత్తిని విఠల్, భాగన్న, విజయ్, రాఘవేంద్ర, శ్రీనివాస్, పుట్టి సాయిలు, దావుగారి విఠల్ తదితరులు ఉన్నారు.

తుల్జా భవాని మాత ఆలయంలో ..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాలోత్ సంగ్యానాయక్ తండాలో శనివారం తుల్జా భవాని మాత వార్షికోత్సవాన్ని తండా వాసులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



కామారెడ్డి రూరల్ : మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గల శివాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన గుడికాడి రాజయ్యతో పాటు పలువురు మహరాజ పోషకుల ఆధ్వర్యంలో శివస్వాములకు బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివబిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు లద్దూరి లక్ష్మీపతియాదవ్, తన్నీరు శేఖర్, ఉరుదొండ నరేష్, చిన్నోళ్ల గోపాల్‌రావు, నీలం వెంకటి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో ..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సేవాలాల్, భవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపన



ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి మండలం సోమర్యాగడి తండాలో శనివారం సేవాలాల్, భవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. తండాలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో సేవాలాల్, భవానిమాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. తండా కార్యక్రమంలో పొరఘడ్ గురువు బాబు మహరాజ్, వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.